# పునాది



స్టెనోగా పోస్టింగ్ ఆర్డర్స్ రావడంతో ఆలస్యం చేయకుండా డ్యూటీలో జాయిన్ అయింది సుజాత. నగరంలో పేరుమోసిన కంపెనీలలో అదొకటి కావడంతో, ఆమెకి ఈ జాబ్ రావడం చాలా ఆనందంగా వుంది. తన చిన్ననాటి స్నేహితురాలు పద్మిని అదే కంపెనీలో టైపిస్టుగా వర్క్ చేస్తుండడం, సుజాత ఆనందం రెట్టింపు కావడానికి కారణం.

గలగల మాట్లాడే స్వభావంగల పద్మిని సుజాతకు అన్ని విషయాలూ వివరించి చెబుతూ, తమ మేనేజర్ గురించి కూడా విపులంగా చెప్పింది. "అతడో స్ట్రిక్టు పర్సన్. ఇరవై నాలుగ్గంటలూ పని గురించే తప్ప మరో ఆలోచన వుండదు. వర్క్ విషయంలో ఏ మాత్రం తేడా వచ్చినా సహించడు. ఆ విషయంలో మాత్రం తనపర భేదాలు పాటించడు. అసలే నువ్వు స్టెనోవి. జాగ్రత్త సుమా!" స్నేహితురాలికి సలహా ఇచ్చింది. సరేనన్నట్టు తలూపింది సుజాత.

సుజాత స్వభావం, పద్మిని స్వభావానికి పూర్తి వ్యతిరేకం. అవసరమైతే తప్ప మాట్లాడదు. తన పనేమో తను... ఎక్కువగా ఎవరితోనూ టచ్ పెట్టుకోదు. అలాగని స్నేహాన్ని చులకనా చెయ్యదు. సుజాత రావడానికి ముందు, స్టెనో పోస్టు ఖాళీగా వుండడతో, తరచూ మేనేజర్ చెప్పే పని పద్మిని చేయవలసి వస్తూ వుండేది.

ఇప్పుడు సుజాత రాకతో పద్మిని పని కాస్త తగ్గింది. ఎందుకో ఆ పరిస్థితి, పద్మినికి కాస్త ఇబ్బందిగానే వుంది. పద్మిని, మేనేజర్ సుకుమార్‌కు బంధుత్వం వున్న సంగతి కొద్దిమంది స్టాఫ్‌కు తెలుసును. తరచుగా అతడి కారులో ఆమె వెళ్ళడం అందరూ చూచినా, సుకుమార్ వ్యక్తిత్వం తెలిసివున్నవాళ్ళు కావడంతో ఎవరూ ఏ అనుమానాలూ పెట్టుకోలేదు. ఒకరిద్దరు గుసగుసలు పోయినా, మిగిలిన వాళ్ళు కసరడంతో సద్దుమణిగిపోయారు.

కొద్ది రోజుల్లోనే సుజాత మంచి వర్కర్‌గా పేరు తెచ్చుకుంది. ఆమె ఎప్పుడయినా సెలవు తీసుకుంటే సుకుమార్ పని ఆగిపోయేది. ఈ వ్యవహారం ఓ కంట చూస్తూనే వున్న పద్మినికి ఒకరకమయిన అసూయ రగిలింది మనసులో. తన ప్రియమైన వస్తువును ఎవరో కాజేస్తున్న ఫీలింగ్! దానికీ కారణం లేకపోలేదు.

సుకుమార్, పద్మినిలు ప్రేమించుకున్నారు. పైగా వరసయినవాళ్ళు. కాకపోతే పద్మిని కుటుంబం మధ్యతరగతిది. సుకుమార్‌కు బంధుత్వాలంటే ప్రీతి. ఫారిన్‌లో చదువుకుని వచ్చినా, ఇండియా అంటే తగని ప్రేమ. ఇక్కడి ఆచారాలంటే గౌరవం. తమ పెళ్ళిలో బంధుత్వాన్ని మరింత గట్టిపరచుకోవాలనుకున్నాడు. అందులోనూ పద్మిని అతడికి ఎంతో వచ్చింది. సుకుమార్ చెల్లెలు ఫారిన్‌లో చదువు ముగించుకుని రావడానికి ఇంకో సంవత్సర కాలం పడుతుంది. ఆమె వచ్చాక, ఇద్దరి పెళ్ళీ ఒకేసారి జరగాలని సుకుమార్ కోరిక. అందుకే తన పెళ్ళిని వాయిదా వేసుకున్నాడు. అంతవరకూ ఈ విషయాలు, స్టాఫ్‌లో తెలియవలసిన అవసరం లేదని భావించి గోప్యంగానే వుంచాడు. అదే మాట పద్మినికి చెప్పాడు.

సుజాత రాకతో పద్మినిలో మార్పు వచ్చింది. ఆఫీసు పనులతో ఎక్కడికి వెళ్ళినా సుకుమార్ సుజాతను వెంటపెట్టుకు వెళ్ళడం ఆమె సహించలేకపోతోంది. సుకుమార్ మారిపోడు కదా? అదే ఆమె అనుమానం. అందుకే అతడిని పరీక్షకు గురిచేయదలిచింది.

"సుజా! నువ్వెంతో తెలివైనదానివి, అందగత్తెవూ కదా! మన బాస్ కొరకరాని కొయ్య! అతగాడిని నువ్వు లొంగదీసుకోగలవా? అబ్బా! అలా కోపంగా చూడకు. ఊరికే పందెం కడదాం! ఇది నీకో ఛాలెంజ్ తెలుసా?" కవ్విస్తూ అంది పద్మిని.

ఆమె వైపు అదోరకంగా చూసింది సుజాత.

సరేనంది. అంతే! పద్మిని చూస్తుండగానే అతి త్వరలో సుకుమార్, సుజాతల ప్రవర్తనలో మార్పు వచ్చింది. సుకుమార్ అసలు సుజాతను వదలకుండా అంటిపెట్టుకు తిరుగుతున్నాడు. పద్మినితో అసలు మాట్లాడడమే లేదు. కళ్ళ ముందు తన జీవితం బూడిదయిపోతున్నందుకు కుమిలిపోయింది పద్మిని.

ఆ రోజు పద్మినిని డిన్నర్‌కు ఇంటికి పిలిచింది సుజాత. వెళ్ళక తప్పలేదు పద్మినికి. అక్కడ అప్పటికే సుకుమార్ వుండడం కలవరపెట్టిందామెను. ముళ్ళ మీద వున్నట్లుగా ఫీలయ్యింది పద్మిని.

డిన్నర్ ముగిసాక వెడ్డింగ్ కార్డు ఒకటి ఆమెకు అందించి, సుజాత "పద్మినీ, నేను కోరుకున్న వాణ్ణే పెళ్ళాడబోతున్నాను. నువ్వు పెళ్ళికి తప్పక రావాలి" ... కళ్ళు తిరిగి తూలి పడబోయిన పద్మిని పాదిని పట్టుకున్నాడు సుకుమార్. ఇక బాధపెట్టదలచలేదు.

"పద్మినీ! ప్రేమించినవాడిపైన ఇంత నమ్మకం లేదా నీకు? సుజాతను నా మీద ప్రయోగిస్తావా? మేమిద్దరం విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోబట్టి, ఏ అనర్థం జరగలేదుగానీ, మరోలా అయివుంటే ఈ కథ ఎలా వుండేది? నిన్ను వదిలి మరో అమ్మాయిని పెళ్ళాడేటంతటి అధముడిలా కన్పిస్తున్నానా? ఇంకెప్పుడూ ఇలాంటి అనుమానాలు పెట్టుకోకు. ప్రేమకు పునాది నమ్మకం" అంటూ పొంగిపొరలే పద్మిని కన్నీటిని తుడిచి అక్కున చేర్చుకున్నాడు. అన్ని బాధలూ మరిచి అతడిని హత్తుకుపోయింది పద్మిని. వాళ్ళను ఒంటరిగా వదిలి చిరునవ్వుతో నిష్క్రమించింది సుజాత.

— కె.ఎ.ఎల్. సత్యవతి,
మహబూబ్‌నగర్

Printed and Published by
K. Jagadish Prasad,
Managing Director
Andhra Printers Ltd.,
P.B.No. 712,
VIJAYAWADA-520 010
Editor: Nanduri
Ramamohana Rao,
Associate Editor: Jonnalagadda
Satyanarayana